క్లుప్తంగా

ఓటింగ్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కలెక్టరేట్ కార్యాలయంలో ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పావని ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎం, కంట్రోల్ యూనిట్, వివిప్యాట్‌ల పనితీరుపై వివరించారు.

ఓటర్ జాబితాపై..

నవాబుపేట: ఓటరు జాబితాపై పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జలాలోద్దీన్ బాబర్, రుకువర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి విచ్చేసి, పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. నాయకులు అజహర్‌అలీ, ఆంజనేయులు, శ్రీహరి, రమేష్, భాస్కర్, వెంకటయ్య, సత్యం తదితరులు ఉన్నారు.

అమిత్‌షాను కలిసిన ఏపీ జితేందర్‌రెడ్డి



పాలమూరు: హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియంలో మంగళవారం జరిగిన విజయ సంకల్ప కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఎయిర్ పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేంతర్‌రెడ్డి కలిశారు. ఈ విజయ సంకల్ప కార్యక్రమానికి జిల్లా నుంచి బూత్ అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లు, మండల కమిటీల సభ్యులు, జిల్లా నుంచి అగ్రశ్రేణి బీజేపీ నేతలు తరలివెళ్లారు.

సదస్సుకు తరలిరావాలి

నవాబుపేట: జిల్లా కేంద్రంలో ఈ నెల 16న ఎమ్మార్పీఎస్ సదస్సుకు తరలిరావాలని నాయకులు శాంతయ్య సూచించారు.మంగళవారం మండల కేంద్రంలో దండోరా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వ్యవస్థాపకులు మంద కృష్ణ పాల్గొంటున్నట్లు వివరించారు.

సభ్యుడిగా రవికుమార్

నవాబుపేట: పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సిద్దోటం పాఠశాల ఉపాధ్యాయుడు రవికుమార్‌ను నియమించినట్లు నాయకులు భూపతిసింగ్, రమాకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు మండల నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, నసీర్ తదితరులు అభినందనలు తెలిపారు.

జీరో బిల్లు ఇవ్వాలి

హన్వాడ: ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం తమకు జీరో బిల్లులు ఇవ్వాలంటూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలంటున్నారని వివరించారు. వినతిపత్రం అందజేశారు.

వసతులు కల్పించాలి

హన్వాడ: సోషల్‌వెల్ఫేర్ హాస్టల్‌లో సరైన వసతులు లేవని, తమకు టాయిలెట్‌లు, నీటి వసతి, ప్రహరీ నిర్మించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ కిష్ట్యనాయక్‌కు విద్యార్థులు వినతిపత్రం ఇచ్చారు . వెంటనే పనులు ప్రారంభించాలని కోరగా.. చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ తెలిపారు.

ట్రాక్‌మెన్ బైక్‌చోరీ

జడ్చర్ల: రైల్వే ట్రాక్‌మెన్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్ తన పల్సర్ బైక్ చోరీకి గురైనట్లు మంగళవారం ఫిర్యాదు చేశారని.. ఈమేరకు కేసునమోదు చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. బాదేపల్లి రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న బాధితుడు ఇంటి ముందర బైక్‌ను నిలిపి ఉంచగా చోరీకి గురైనట్లు వివరించారు.

పంటలు ఎండుతున్నాయి

జడ్చర్ల: భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీటి మట్టాలు పడిపోయాయని.. పంటలు ఎండిపోతున్నాయని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. మంగళవారం కోడ్గల్ పరిధిలోని గైరాన్‌తండాలో నీళ్లు పరిపడా లేక సాగు చేసిన వరి పంట ఎండిపోవడంతో బాధిత రైతులు శంకర్, హర్యానాయక్‌లను ఆయన పరామర్శించారు. ఎండిన పంటల వివరాలను సేకరించి రైతులకు నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్ మోహన్ నాయక్, మంజ్యానాయక్, తిరుపతి, నాగేష్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌చేడ్‌లో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన నగేష్‌గౌడ్ గేదె మంగళవారం వ్యవసాయ పొలం వద్ద గడ్డి మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్‌ఖన్న అక్కడికి వెళ్లి నిర్వహించారు. గేదె విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని బాధితుడు నగేష్‌గౌడ్ తెలిపారు.

పనులు ప్రారంభం

మహమ్మదాబాద్: అన్నారెడ్డిపల్లితండాలో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ లక్ష్మీమోహన్ మంగళవారం ప్రారంభించారు. త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు. మండల కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షుడు ఫల్గుణ, నియోజకవర్గ అధ్యక్షుడు కాత్రవత్ మోహన్, మాజీ ఎంపీటీసీ గోపాల్, లోక్యా, రఘు పాల్గొన్నారు.

లోపాలుంటే చర్యలు తప్పవు



ఉపాధి పనులపై విచారణ చేస్తున్న జిల్లా అధికారుల

- అవకతవకలపై ఆరాతీసిన అధికారులు
- రికవరీ చేయాలని ఆదేశాలు
- దేవరకద్రలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక

దేవరకద్ర: మండలంలోని 31 గ్రామాల్లో 2023, మార్చి, 31 వరకు జరిగిన రూ. 5.15 కోట్ల పనులపై మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ప్రతి గ్రామంలో జరిగిన పనులపై జిల్లా అధికారులు ఆరా తీశారు. చేపట్టిన పనులు, పూర్తయిన వాటికి ఫొటోలను, సామాజిక తనిఖీలో విచారణ చేసి రూపొందించిన నివేదికలను పరిశీలించారు. ప్రతి పనికి సంబంధించిన పూర్తి వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు వేదికపై వివరించారు. ఉపాధి హామీకి సంబంధించి రూ. 3.49 కోట్లు, సీసీ రోడ్లకు రూ. 2.66 కోట్లు ఉన్నాయి. కాగా ఆయా పనుల్లో జరిగిన అవకతవకలపై జిల్లా అధికారులు ఆరాతీశారు. విచారణ చేసి రికవరీలు చేయాలని మండల అధికారులకు ఆదేశించారు. డీఆర్‌డీఓ నర్సిములు, అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదా బేగం, ఏపీడీ శ్రీపాద, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, శ్రీనివాసులు, ఏపీఎం మంజుల, సంజీవ్‌కుమార్, ఎఫ్‌ఎం ప్రేమలత తదితరులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పనులలో పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ నర్సిములు హెచ్చరించారు. ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉండే అధికారులు ఉపాధి పనులపై తగిన శ్రద్ధ చూపాలని, పనులలో నాణ్యత ఉండేలా చూడాలని సూచించారు. చేయని పనులు చేసినట్లు చూపినా.. పనుల్లో నాణ్యత లేకున్నా రికవరీలు తప్పవని, అలాగే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ కార్మికుల ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, నాయకులు వెంకటేశ్, రామకృష్ణ, కార్మికులు అంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: గ్రామ పంచాయితీలల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జీఎస్ దేవదానం డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులతో కలిసి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు చెల్లించాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కోళ్ల వెంకటన్న, కొండన్న, చంద్రన్న, సాంబశివుడు, గోపాల్, ఆంజనేయులు ఉన్నారు.

సామాజిక స్ఫూర్తికి పాతరేస్తున్న పార్టీలు

జడ్చర్ల టౌన్: రాజకీయ పార్టీలన్నీ పార్లమెంట్, స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికలో బీసీలను విస్మరించి సామాజిక న్యాయస్ఫూర్తికి పాతరేశారని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆరోపించారు. మంగళవారం జడ్చర్ల బీసీసేన కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి పాటుపడతామని చెబుతున్న పార్టీలు.. బీసీలను పూర్తిగా విస్మరించాయన్నారు. బీసీ వ్యతిరేక పార్టీలకు ఓటు వేయకూడదని పిలుపునిచ్చారు. ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ తోపాటు బీఆర్ఎస్ ఒకే సామాజిక వర్గానికి టికెట్ ఇచ్చినందున.. కనీసం బీజేపీ అయినా బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నర్సిములు, గోపాల్, మురళి, సురభిరఘు, గోపాల్, వెంకటేశ్, జగదీశ్‌చారి,నర్సింములు, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణయాదవ్

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం డీసీసీ కార్యదర్శి ఎం.కృష్ణయ్య ఆధ్వర్యంలో హన్వాడ మండలానికి చెందిన పలు గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు, లేబర్ సంఘం అధ్యక్షులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో లేబర్ సంఘం టంకర అధ్యక్షుడు బుడ్డన్న, మల్లేష్, వెంకటయ్య, కృష్ణయ్య, రాంచంద్రయ్య, ఆంజనేయులు, మల్లేష్, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



దేవరకద్ర: మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ భవన ఇతర నిర్మాణ రంగ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు యాభైమందికి పరీక్షలు చేశారు. సంబంధిత రిపోర్టులను రెండు రోజుల తరువాత ఇక్కడికే వచ్చి అందజేస్తామని డివిజన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్ నరేష్‌లు తెలిపారు. ఆరోగ్య కార్డు ఉన్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి గురించి ముందుగానే తెలుపుతామన్నారు. అలాగే వారి ఆరోగ్య పరిస్థితిపై ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని వివరించారు. వైద్య నిపుణులు తాజీబాబా, తౌరీఫ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



మెట్టుగడ్డలోని జరిమానా విధిస్తున్న శానిటర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాలలో నిషేధించిన ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న దుకాణాలను మంగళవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా మెట్టుగడ్డ, తెలంగాణచౌరస్తా, రాజేంద్రనగర్, వన్‌టౌన్ ఏరియా, శివశక్తినగర్ తదితర ప్రాంతాల్లో 35 కిలోల ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను స్వాధీనపరుచుకున్నారు. ఈ సందర్భంగా దుకాణ యజమానుల నుంచి రూ.ఆరు వేలు జరిమానా వసూలు చేశారు.

పెన్షన్ పెంపుపై ప్రకటన చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల కనీస పెన్షన్ పెంపుదలపై పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి కంటే ముందే కేంద్రం ప్రకటన చేయాలని ఆర్టీసీ, ఈపీఎస్ పెన్షన్ జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద మంగళవారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, ఈపీఎస్ పెన్షనర్లు నిర్వహించిన ధర్నాలో రాజసింహుడు మాట్లాడారు. ఈపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ పెంపుదల కోసం ఇక ఆమరణ నిరాహార దీక్ష ఒక్కటే మిగిలిందన్నారు. గత అనేక ఏళ్లుగా పీఎఫ్‌పై వస్తున్న కనీస పెన్షన్ కరువు భత్యంతో రూ.7500లకు పెంచాలని, పెన్షనర్ల భార్యభర్తలకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలనే తదితర డిమాండ్ల సాధన అనేక సార్లు ఆందోళనలు నిర్వహించినట్లు తెలిపారు. ధర్నాలో జీబీ. పాల్, ఉమేష్ కుమార్, ఆర్.నారాయణ, మనోహర్, నాగాంజనేయులు, జేఎస్‌రెడ్డి, బస్వరాజు, సుల్తాన్, డేవిడ్‌తోపాటు తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా బోయ శ్రీనివాస్



మహబూబ్‌నగర్‌రూరల్: బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాచన్‌పల్లి గ్రామానికి చెందిన బోయ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మంగళవారం ప్రకటించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం కృషిచేస్తామని తెలిపారు.

సవాళ్లను ఎదుర్కోవాలి



హన్వాడ: మహిళలు తమ విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కొని నిలబడాలని ఎంపీడీఓ యశోదమ్మ సూచించారు. మంగళవారం పెద్దర్పల్లి సమీపంలోని ఎంజేపీ గురుకులలో మహిళా దినోత్సవానికి రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్‌తో పాటు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తహసీల్దార్ కిష్ట్యనాయక్, ఎంఈఓ రాజునాయక్, మండల నోడల్‌అధికారి రాముడు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కిష్ట్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి గోల్డ్‌మెడల్

జడ్చర్ల టౌన్: బాదేపల్లి సరస్వతి శిశుమందిరం విద్యార్థి కిట్టు ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానాచార్యులు వెంకటయ్య తెలియజేశారు. ఈ మేరకు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ పంపించగా మంగళవారం పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు చిగుళ్లపల్లి పద్మలీల లక్ష్మీనారాయణ దంపతులు విద్యార్థికి అందజేసినట్లు తెలిపారు. పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణతోపాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న కోటానాయక్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని జిల్లా యువజన అధికారి కోటానాయక్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నారీశక్తి ఫిట్‌నెస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్‌సీసీ అధికారిని రాజేశ్వరీ పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా నాగరాజు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన ఏర్పుల నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ పిట్టం ఉత్తర్వులు జారీ చేశారు.

దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కోయిల్‌కొండ: అనంతపూర్‌లో దళితులను ఆలయంలోకి రానివ్వకుండా గుడికి తాళం వేసి కులంపేరుతో దూషించిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు మంగళవారం తహసీల్దార్ భరత్‌కు వినతి పత్రం సమర్పించారు. శివరాత్రి సందర్భంగా ఎస్సీ వర్గానికి చెందిన శివస్వాములు ఇరుముడి కట్టడానికి ఆలయంలో పూజలు చేస్తుండగా.. కుటుంబ సభ్యులుతో పాటు వస్తే గుడిలోకి రావద్దని గ్రామానికి చెందిన కొందరు బెదిరించినట్లు వివరించారు. నాయకులు నాగన్న, వెంకటయ్య, బండినాగరాజు, భరత్, శ్రీనువాసులు, కురుమయ్య తదితరులు వినతి పత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

సస్యరక్షణ చర్యలపై సూచనలు



హన్వాడ: మామిడి సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం టంకర రైతువేదికలో అధికారులకు హైదరాబాద్ నుంచి వీసీలో పలు సూచనలు చేశారు. వివిధ అంశాలపై ఈ సందర్భంగా వారు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్, ఉద్యానశాఖాధికారి సాయిబాబ, మహబూబ్‌నగర్, గండేడ్, మహమ్మదాబాద్, హన్వాడ మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

రాజాపూర్: యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, సరిన నిర్ణయాలతో ముందుకు సాగాలని రాజాపూర్ ఎస్ఐ రవి అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాయపల్లి యువకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంపై అభినందించారు. సూరిగౌడ్, బాల్‌రాజ్, నర్సింలు, పల్లె శేఖర్, ప్రశాంత్‌చారి, గంగాధర్‌గౌడ్, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సభకు తరలిన నాయకులు



దేవరకద్ర నుంచి వెళ్తున్న నాయకులు

సాక్షినెట్‌వర్క్: హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప మహాసభకు జిల్లా నుంచి నాయకులు తరలివెళ్లారు. దేవరకద్ర నుంచి జిల్లా బీజేపీ కార్యదర్శి నారాయణరెడ్డి, బీజేపీ శేఖర్, కృష్ణంరాజు, నాగిరెడ్డి, దేవన్న, అమరేందర్‌రెడ్డి, అంజనేయులు, మాధవులు తదితరులు ఉన్నారు. జడ్చర్ల నుంచి వెళ్లిన వారిలో పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, వెంకట్, మధు, శ్రీనివాస్‌గౌడ్, నరేష్ తదితరులు ఉన్నారు. మిడ్జిల్ నుంచి బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు నరేందర్ తదితరులు తరలివెళ్లారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



మిడ్జిల్‌లో వీడ్కోలు సమావేశం



జానంపేటలో..

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు తమకు పాఠశాలతో ఉన్న అనుబంధంను వివరించారు. అనంతరం డ్యాన్స్‌లతో అలరించారు. హెచ్ఎం సరస్వతి, ఉపాధ్యాయులు శ్రీశైలం, సురేందర్‌రెడ్డి, రవిశంకర్, రాజేందర్‌గౌడ్, పరశరాములు, కోట్యా, అరుణ, సుమతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ నాగన్న

అడ్డాకుల: పదో తరగతి విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదవాలని మూసాపేట ఎస్ఐ కె.సుజాత అన్నారు. మూసాపేట మండలం జానంపేటలో విశ్వభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. పిల్లలు ఒత్తిడిని తగ్గించుకుని చదువులపై దృష్టి సారించాలని చెప్పారు. హెచ్ఎం శివకుమార్, సాహితీవేత్త భీంపల్లి శ్రీకాంత్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

దేవరకద్ర: చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని దేవరకద్ర ఎస్ఐ నాగన్న తెలిపారు. మంగళవారం దేవరకద్ర బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూపొందించిన చట్టాలకు లోబడి సమాజంలోని ప్రతి పౌరుడు ఉండాలని దీనికి వ్యతిరేకంగా నడుచుకుంటే చట్టపర చర్యలు తప్పవని వివరించారు. విద్యార్థులు మంచి నడవడికతో ఏకాగ్రతతో, లక్ష్యం సాధించే విధంగా చదువుకోవాలని సూచించారు.

వాల్‌పోస్టర్ విడుదల

హన్వాడ: ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన మహబూబ్‌నగర్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని దండోర నాయకులు కోరారు. మంగళవారం మండలకేంద్రంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. 22న జిల్లా కేంద్రంలో సదస్సు ఉంటుందన్నారు. ఎంపీపీ బాల్‌రాజు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ జంబులయ్య, దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.